భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం

విశాలాంధ్ర - సామర్లకోట : భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇచ్చిన పలు జీవో కాపీలను ఆదివారం ఉదయం సామర్లకోట విగ్నేశ్వర థియేటర్ ఎదురుగా కృష్ణుని ఆలయం వద్ద వేసిన భోగి మంటల్లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా సీపీఐ కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్డి సత్యనారాయణ, పలువురు కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుగ రోజూ నిరసన

విశాలాంధ్ర - జగ్గంపేట : భోగీ పండుగ రోజున ఆదివారం కూడ అంగన్వాడీలు జగ్గంపేటలో నిరసన చేపట్టారు. గత 33 రోజుల నుంచి అంగన్వాడిలు నిరసనలు కొనసాగుతున్నాయి. పండుగలను సైతం పట్టించుకోకుండా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతు పంచాయతీ గృహం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద భోగిని పురస్కరించుకొని హరిదాసుతో సంకీర్తనలు పాడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం పెంచాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, రాజేశ్వరి, రామ్ లీలా, అనంతలక్ష్మి, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.

భారీ భోగి పిడకల దండ ఊరేగింపు

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండ లంలోని గుమ్మిలేరు గ్రామంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా మహిళలందరూ కలిసి రూపొందించిన 600 మీటర్లు పొడవైన భోగి దండను మేళతాళాల మధ్య గ్రామంలోని వెంక టేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభించి గ్రామదేవత ఉరదాలమ్మ, దండు గంగమ్మ ఆలయం వరకు ఊరేగించి గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన భోగిమంటలో వేశారు. చిన్నారులు మొదలుకొని వయోవృద్ధుల వరకు ఊరేగింపులో పాల్గొన్నారు.

పోలీసుల ఆంక్షలు బేఖతార్

విశాలాంధ్ర - కాకినాడ : బరిలు వద్ద పోలీసులు ఏర్పాటుచేసిన హెచ్చరిక ఫ్లెక్సీలను నిర్వాహకులు బేఖతారు చేస్తున్నారు. కోడిపందాలు, గుండా టలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రామ గ్రామాన లక్షల సంఖ్యలో పందెం కోళ్ల కత్తులకు బలైపోతున్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడడంతో వివిధ పార్టీ నాయకులు కోడిపందాలు బరిలకు హాజరవుతారని ఇటువంటి సమయంలో ఏ క్షణమైనా ఘర్షణ చోటు చేసుకోవచ్చని, కాబట్టి ముందస్తు చర్యగా బరులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: భోగి సందర్భంగా తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. ఈ భోగి మంటలలో పిల్లలు కొత్త దుస్తులు ధరించి ఆవు పిడకలు వేసి సాంప్రదాయపద్ధంగా చల్లుగాచుకున్నారు ప్రతి ఇంటి వద్ద బాలబాలికులకు భోగి పళ్ళు వేసి పండుగను ప్రారంభించారు సుఖశాంతులకు సేకనంగా భోగి పండుగ జరుపుకో వడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు మండలంలో దేవర పల్లి పల్లంట్ల ఎర్నగూడెం, చిన్నాయగూడెం యాదవోలు దుద్దుకూరు గ్రామాలలో ఆదివారనాడు సాంప్రదాయ బద్ధంగా భోగి జరుపుకున్నారు ప్రతి ఇంటి వద్ద కొత్త అల్లుళ్లతో పండుగ వాతావరణం ఏర్పడింది

కందుల ఉషారాణి మృతి బాధాకరం

విశాలాంధ్ర-కొవ్వూరు: జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ సతీమణి ఉషారాణి మరణం బాధాకరమని వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని కొవ్వూర్ నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ టీవీ రామారావు అన్నారు. దుర్గేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తు కందుల ఉషా రాణి భౌతికేయానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

టీడీపీ భోగి సంకల్పం

విశాలాంధ్ర- ఉండ్రాజవరం: రాష్ట్ర టీడీపీ పిలుపు మేరకు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు స్వగ్రామం వేలివెన్నులో భోగి సంకల్పం చేశారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని, అక్కరకు రాని, పాత కలపతో పాటు కీడు పోవాలి - ఏపీ వెలగాలి అంటూ నినాదాలతో వైస్సార్సీపీ జారీ చేసిన అడ్డగోలు జీవో లను భోగిమంటలో వేసి, తగలబెట్టినట్లు శేషారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పెద్దలు, ప్రజలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పేదవారి కోసమే అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర - జగ్గంపేట : పేదవారి కోసమే అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి ఆకలి తీరుస్తున్నామని టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ఆదివారం నిర్వహించారు. ఈ సోమ వారం సంక్రాంతి కావడంతో ఆదివారం నిర్వహించి పేదలకు అహరాన్ని వడ్డించారు. జగ్గంపేటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ టిడిపి సీనియర్ నాయకులు మానేపల్లి సాయి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు.

శిల్పారామంలో అలరించిన గాత్రకచేరి

విశాలాంధ్ర : సంక్రాంతి సంబరాలలో భాగంగా కూచి భాస్కరరామం గాత్రకచేరి సందర్శకులను తమ గాత్ర మాధుర్యంతో అలరించారు. కేటి సుబ్బరామన్ వయొలిన్ మరియు ఎ అనిల్ కుమార్ మృదంగ సహకారం అందించారు. కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని రంగారావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ వాగ్గేయ కారుల, అన్నమాచార్య, భక్త రామదాసు కీర్తనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమం శ్రీ భక్తాన్జనేయ సురుచి ఫుడ్స్ - హెూమ్ బైట్ వారి సహకారంతో శిల్పారామం వారు నిర్వహించారు. శిల్పారామం పరిపాలనాధికారి ప్రకాష్ విచ్చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కోడే గెలిచింది.. ఖాకీలు ఓడారు..

విశాలాంధ్ర-కొవ్వూరు: అదేదో జబర్దస్త్ షోలో రాజ మౌళి చెప్పినట్లు లిక్కరుకూ, లివర్కు మధ్య పోరాడి వ్యక్తి చనిపోయాడు అన్న నానుడికి నిదర్శనంగా కోడిపందాల నిర్వహణను చెప్పవచ్చు. వివరాలకు వెళితే ఈ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏడాది కోడిపందాలు నిర్వహణపై పోలీసులు పది రోజులు ముందే హడావిడి చేస్తూ గ్రామాలలోని పట్టణాల్లోని ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి కోడిపందాలు ఆడొద్దు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఈ నేపథ్యంల్లో విశాలాంధ్ర పత్రికలో నిన్నటి రోజున సంక్రాంతి సంబరాలలో కోడి గెలుస్తుందా. పోలీస్ గెలుస్తారా అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం వరకు కోడిపందాలు వేయకుండా పోలీసులు అడ్డుకున్నారు ఆ తర్వాత అధికార పార్టీ ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ రావడం పోలీసులు తోక ముడవడం ఎప్పటిలాగా ఆనవాయితీగా మారింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి పందెం రాయుళ్లు కోడిపుంజులువలే జూలు విదిల్చి రెచ్చిపోయి మరి పందాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గుండాటల సైతం నిర్వహిస్తున్నారు. ఇంతా జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీనిని బట్టి మనకి అర్థమైన సారాంశం ఏమిటంటే ఖద్దరు, కాకీలుమధ్య పోరులో నలిగిపోయింది ప్రజలే అని కదూ.. ఇంకెందుకు సంక్రాంతి ముందు పది రోజుల నుంచి ఖాకీలు ప్రజల సదస్సులు నిర్వహించటం అవి కాస్తా నిరూపయంగా మారటం షరా మామూలే ఎప్పుడూ జరిగేది కదా అని ప్రజలు వాపోతున్నారు.

శ్రీ స్కంద బాలాజీ సూర్యదేవాలయానికి విరాళం

విశాలాంధ్ర-గోకవరం: గ్రామంలో దాతల ఆర్థిక సహాయంతో స్థలదాత శ్రీ అక్షింతల రాజారాణి దంపతుల సంకల్పంతో సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సూర్యదేవాలయముకు హైదరాబాదులో స్థిరపడిన మల్లిసాల వాస్తవ్యులు పాలిపిరెడ్డి సుబ్రహ్మణ్యం సమితికి రూ.1,18,118విరాళం అందించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబు మాట్లాడుతూ క్షణక్షణం క్షీణిస్తున్న హిందూ ధర్మాన్ని పునరుద్ధరించాలనే సంకల్పంతో సమితి నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల పట్ల ప్రజలు తమ ఆమోదాన్ని హర్షాన్ని విరాళాలు ఇవ్వడం ద్వారా వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజా,కొరిపిల్లి అప్పలస్వామి,చందం వెంకటేశ్వరరావు,తాటికొండ శ్రీనివాసు,పిల్లంగోరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలతో పల్లెలు కళకళ

విశాలాంధ్ర - అనపర్తి : మన పూర్వీకులు చెప్పిన విధంగా ప్రతి సంప్రదాయం వెనుక అనేక అర్థాలు, అంతరార్థాలు, రహస్యాలు ఉంటా యి. అవి తెలియక పోయినంత మాత్రాన ఆచార సంప్రదాయాలు మూఢనమ్మకాలనుకోవడం మూర్ఖత్వం. వాటి విలువలను తెలుసుకుని చేసుకుంటే అవి మనకు మార్గదర్శకాలు అవుతాయనేదానికి నిదర్శనాలు. ఆ విలువలు, సాంప్రదాయాలు కాపాడుతూ బంధువుల రాకపోకలు, స్నేహితుల కలయిక, భోగి మంటల వెలుగు జిలుగులతో ఆదివారం మండలంలో పల్లెలు కళకళలాడాయి. ఎంత హైటెక్ యుగమైనప్పటికీ సాంస్కృతి, సాంప్రదాయాలు మారలేదు. భోగి పండగ పురస్కరించుకుని తెల్లవారుజామునుండే అన్ని గ్రామాల్లోని అనేక కూడలిలో భోగి మంటలు వేశారు. ఉద్యోగ, వ్యాపార,ఇతరేతర వృత్తుల రీత్యా పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న గ్రామాలకు చెందిన ప్రజలు తమ సొంత గ్రామాలకు చేరుకుని అత్యంత వైభవంగా భోగి పండుగ జరుపుకోవడంతో భోగి మంటలు, బంధువుల రాకపోకలతో గ్రామాలన్నీ సంక్రాంతి శోభతో వెలిగిపోతూ కళకళలాడుతున్నాయి.

కోడిపందేలకు శ్రీకారం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండలంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి రోజున కోడిపందాలుకు తెర తీశారు. పండుగ మూడు రోజులూ ఇవి సాంప్రదాయ బద్ధంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే కోడిపందాలు అనుమతి లేదంటూ 11 గంటల సమయంలో పోలీస్లు తమ హడావిడిని తగ్గించారు. కాగా అధికార పార్టీకి మాత్రమే కోడిపందాలు వేసుకునే అవకాశం కల్పించి టీడీపీకి అనుమతి ఇవ్వక పోవడంతో టీడీపీ వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడిపందాలు అన్ని చోట్ల ఆపేయాలని, లేకుంటే తమ బరిలో కూడా పందాలు ఇవ్వాలని టీడీపీ వర్గాలు పోలీస్లను నిలదీశారు. ఎట్టకేలకు కోడిపందాలు టీడీపీ బరుల్లో 12 గంటలకు ప్రారంభమయ్యాయి. తాళ్ళపూడి మండలంలోని తాళ్ళపూడి.2, పెద్దేవం.2, రావూరుపాడు.1, గజ్జరం.2, మలకలల్లి.1, చొప్పున కోడిపందాలు నిర్వహించారు. గత ఏడాది తో పోలిస్తే కోడి పందాలు నిర్వహణ సజావుగా ప్రారంభమైనట్లే. కాగా సంక్రాంతి ముందు నుండి అధికారులు ఆంక్షలు అమలు చేసి, 90 మంది పై బైండోవర్ కేసులు పెట్టినట్లు తాళ్ళపూడి ఎస్సై కె.వి.రమణ తెలిపారు.

అంగన్వాడీల భోగి మంటలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి, ఎస్మా చట్టం ప్రతులు భోగిమంటల్లో కాలి బూడిదగా మారాలని భోగి మంటలు ఏర్పాటు చేసినట్లు అంగన్వాడీలు తెలిపారు. మండల కేంద్రం ఉండ్రాజవరం తహసిల్దార్ కార్యాలయం వద్ద గత నెల రోజులు పైగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రహదారి కి అనుకుని, పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో అంగనవాడీల సమస్యలు తీర్చాలని నినాదాలు చేశారు. సమస్య సీఎంకు చేరేలా లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి తగలబెట్టినట్లు రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ రంగనాయకమ్మ, వి లక్ష్మి, కె ఎం ఎస్ ప్రసన్న కుమారి, రత్నకుమారి, సిహెచ్ జ్యోతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : భోగి మంటల్లో ప్రభుత్వ వైఖరిని దహనం చేయాలని యుటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గొల్లప్రోలు మండల యుటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో భాగమైన ఉపాధ్యాయులను శత్రువులుగా చూస్తున్నారని, తమకు రావలసిన బకాయిలను సైతం ప్రభుత్వం వాడుకుని, బకాయిలు అడిగినందుకు తిరిగి ఉపాధ్యాయులపైనే అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - కరప : కాకినాడకు చెందిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మందికి చీరలు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని స్థానిక మెరక వీధి రామాలయం వద్ద కరప గ్రామానికి చెందిన నిరుపేదలకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా భద్రం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా సత్యనారాయణ, నక్కా శ్రీను బాబు, పాట్నీడి సూరిబాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై శ్రీను నాయక్ తెలియజేశారు. వివరాల ప్రకారం ఆలమూరు మండలంలోని చెముడులంక జాతీయ రహదారిపై ఈనెల 5వ తేదీన మతిస్థిమితం లేని, గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు డివైడర్ పై నుండి జారిపడి తీవ్ర గాయాలుపాలు కావడంతో స్థానికుల సహకారంతో 108 వాహనంపై ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆదివారం చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. వయస్సు సుమారు 30-40 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు ఆలమూరు పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని కోరారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. వివరాలకు 9440904849 సంప్రదించాలని కోరారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-పెరవలి: జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మన ఊరు మన ఆట కార్యక్రమంలో భాగంగా నిడదవోలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బోగవల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో ఆదివారం సంక్రాంతి రంగవల్లుల ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈసందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేన మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మండలం అధ్యక్షులు పిప్పర రవి మాట్లాడుతూ పెరవలి మండలంలో ప్రతి గ్రామంలోనూ జనసైనికులు జూదాలకు వ్యతిరేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ముగ్గుల పోటీలు పెడుతున్నారని ఇది చాలా సంతోషకరమన్నారు.విజేతలకు ప్రథమ బహుమతి ద్వితీయ బహుమతి తృతీయ బహుమతులుగా గ్రైండర్ మిక్సీలు బహుమతులుగా అందజేశారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు కోటిపల్లి మురళీకృష్ణ మేడిచర్ల శివ కోలా సితయ్య నాయుడు రేలంగి రాజేష్ గౌడ్ గండేపల్లి హనుమంతరావు చిట్టీడి త్రిమూర్తులు కొత్తపల్లి సత్యనారాయణ కనికినీడి ప్రసాద్ మారిశెట్టి దుర్గారావు జాలాది నాగరాజు తెదేపా మండల అధ్యక్షులు అతికాల కృష్ణమ్మ తెదేపా నాయకులు నల్ల సురేంద్ర అక్కిన గంగాధర్ రావు వేంద్ర వెంకట్రామూర్తి నరుకుల నాగరాజు ముక్కామల ఉప సర్పంచ్ కాల్దాసి వీరేష్ బాబు తెదేపా కార్యకర్తలు జనసేన కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

యువకుల వివాదం.. స్తంభించిన ట్రాఫిక్

విశాలాంధ్ర - గోపాలపురం : కోడిపందాలలో ఇద్దరు యువకులు మధ్య జరిగిన స్వల్ప వివాదం ట్రాఫిక్ స్తంభింపజేసే వర్గపోరుగా మారింది. ఆదివారం సాయంత్రం స్థానిక గోపాలపురం ప్యాలస్ హెూటల్ ప్రాంతంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఇద్దరు యువకుల మధ్య జరిగిన స్వల్ప వివాదం కాస్త ఇరు వర్గాల మధ్య పోరుగా సాగి జాతీయ రహదారిని స్తంభింపజేసే వివాదంగా మారింది. సుమారు గంటసేపు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో బాటసారులకు అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు స్పందించి రంగ ప్రవేశం చేసి రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్ను స్తంభింపజేసిన యువకుల సమన్వయపరిచి సమస్యను సద్దుమణిచారు. దీనిపై ఎస్ఐ కే సతీష్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాల సందర్భంలో యువత సమన్వయంతో పండుగను జరుపుకోవాలి తప్ప వివాదాలకు తావులేకుండా ఒకరినొకరు సహకరించుకోవాలని ఆయన సూచించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/ 2023, దాని జిఒ ప్రతులు భోగిమంటల్లో వేసి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురంలో సిపిఐ నాయకులు మరియు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్ ప్రతినిధులు కలిసి పై కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ నియోజవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, కార్యవర్గ సభ్యులు వి కృష్ణమూర్తి, ఎం సత్యభద్రరాజు, ఐఎఎల్ ప్రతినిధి వర్గం వి గోపాలరావు, వై దుర్గాప్రసాద్, బి తారకేశ్వరరావు, పి రవి శ్రీనివాస్, వై రామరాజు కాపు, తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ పేదలు హుందాగా జీవించాలి, ఆత్మ గౌరవంతో బ్రతకాలి అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యతా విజయపథం పాదయాత్రను తిరుపతి జిల్లా తడ నుండి ప్రారంభించారు. నేటికి 2400 కి.మీ. పూర్తి చేసుకుని డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన చేరుకున్నారు. కాట్రేనికోనలో విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయినా గాని పేదల బ్రతుకులు ఏమీ మారలేదు, ఎన్ని ప్రభుత్వాలు మారినా గాని పేదల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు అన్నారు.పేదల బతుకుల్లో మార్పులు రావాలి అంటే కుల మతాలకు అతీతంగా పేదలు అందరూ ఏకమై, ప్రత్యన్మాయ శక్తిగా ఎదిగిన రోజే పేదల బతుకుల్లో వెలుగులు పూస్తాయి అని ఆయన పిలుపునిచ్చారు. ఆ దిశగా మేము ముందుకు కదులుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నల్లా నరసింహ మూర్తి, కాశి హనుమంతరావు, గెల్లా రాజేంద్ర, లత, భాస్కర శాస్త్రి, ఆటో యూనియన్ నాయకులు గిడ్ల గణేష్, పిఎస్ఎన్ మూర్తి, కేశవ, పరమట రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - గండేపల్లి : తెలుగువారికి అత్యంత సాంప్రదాయమైన పండుగగా సంక్రాంతి వేడుకలు జరుపుకునే భాగంగా గండేపల్లి మండలంలో 18 గ్రామాలను సాంప్రదాయ ప్రధంగా ఉదయాన్నే నలుగు పిండితో తల స్నానాలు చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామ కూడలిలో వేసిన భోగి మంటల్లో పిల్లలు భోగి పిడకలు దండలుగా చేసి మంటలో చుట్టూ తిరుగుతూ ఉల్లాసంగా గడిపారు. అదేవిధంగా సాంప్రదాయ దుస్తులతో డాన్సులు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దులుతో నృత్యాలు నిర్వహించారు.

రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఆత్రేయపురంలో పడవల పోటీలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలోనీ ఆత్రేయపురం గ్రామంలో బొబ్బర్లంక-ఆత్రేయపురం ప్రధాన పంటకాలువలో ఏర్పాటు చేసిన కేరళ తరహా పడవల పోటీలు, ఈతల పోటీలను చిర్ల జగ్గిరెడ్డి వైసీపీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతికి సొంత వాళ్ళతో సంతోషంగా గడపడానికి ఊరికి వచ్చే అందరికీ కొత్తపేట నియోజకవర్గంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, సంక్రాంతి అంటే కొత్తపేట అనే విధంగా జరిగే ప్రభల ఉత్సవాలు, బాణసంచా కాల్పు, సంప్రదాయ కోడిపందాలు, కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగే సంక్రాంతి సంబరాలు, అవిడి గ్రామంలో జరిగే ప్రభల తీర్ధం, రావులపాలెంలో సీఆర్సీ ఆధ్వర్యంలో నిర్వహించే వేమన జయంతి మరియు సంక్రాంతి సంబరాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా రకరకాల కార్యక్రమాలు ప్రజలకు ఈ సంక్రాంతి సంవత్సరం మొత్తం గుర్తుంచుకునే మంచి జ్ఞాపకంలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్యాలు తిలకించి కళాకారులను అభినందించారు. ఈ రకమైన పోటీలను మనకు పరిచయం చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోనసీమ జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రకాష్లను, కార్యక్రమాన్ని భుజస్కంధాలపై వేసుకుని నిర్వహిస్తున్న చిర్ల యూత్ ఫోర్స్ సభ్యులను, పిఈటీలను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందాలని, అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆత్రేయపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు పేరు మీద కోటి రూపాయలతో చెరువును అభివృద్ధి చేసి పార్కుగా తీర్చిదిద్దుతున్నామని తెలియచేశారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పదవీ విరమణ 62యేళ్లకు పెంచాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి ఆర్థిక ప్రయోజనాల భారం నుండి తప్పించుకున్న వైసీపీ ప్రభుత్వం పదవి విరమణ అనంతరం ఆర్థిక ప్రయోజనాలు లేకుండా పని చేస్తున్న ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచలేదని వీరి పట్ల వివక్ష చూపడం సమంజసం కాదని రాజోలు నియోజక వర్గం తెలుగు రైతు అధ్యక్షులు ఈలి శ్రీనివాస్ అన్నారు. సహకార సంఘాలు, అంగన్వాడిలు, గ్రామ పంచాయతీలు మొదలగు ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులకు అన్యాయం చేశారని ప్రేర్కొన్నారు. ఇటీవల హడావిడిగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తున్న ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలుగా జాబ్ క్యాలెండర్ లేకుండా చేసిందని ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వలేదని దీంతో నిరుద్యోగ యువత అర్హత వయస్సు కోల్పోయారని, కావున అర్హత వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. వాశంశెట్టి శంకర్రావు, ఇంటి గణపతి రావు, అప్పారి వెంకటేశ్వరరావు, కంచి విశ్వనాథం, సాపే కాశీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేన ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం యాదవోలు గ్రామంలో మన ఊరు మన ఆట సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగ రోజున ఆడవారికి యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు అనిశెట్టి గంగరాజు యాదవొలు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, యాదవొలు గ్రామ జనసేన పార్టీ ఉపాధ్యక్షులు ముమ్మడి బాలకృష్ణ, కాపు సంక్షేమ సేన తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి మధు అనిశెట్టి, తాత బాబు దేగల రమణ, బల్లే సతీష్, రావుల సతీష్, అనిశెట్టి, వరలక్ష్మి, మహిళలు తదితరులు ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొని జయప్రదం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని కందికుప్ప జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యా ర్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. 15 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాలలో తమ విద్యార్థులను తోటి ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు దుశ్శలువతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు జోగయ్య చార్యులు, ఎస్ వెంకటనారాయణ, కేవివి సత్యనారాయణ, కృష్ణ మోహన్, హరిబాబు, శ్రీలక్ష్మి, అరుణశ్రీ, సుబ్బరాజు, కుమార్ రాజా, సూర్యనారాయణ, టీవీ రెడ్డి, రాధాకృష్ణ, దివాకర్ సుబ్రమణ్యం, బ్రహ్మానందం, అంజిబాబు, ప్రజ్ఞానందంలను సన్మానించారు. విద్యార్థులు సన్నీ కుమార్, నరేష్, రాజ్ పండు సత్యనారాయణ, మూర్తి, సత్య వెంకట ప్రసాద్, సంధ్య, సంతోషి, విజయ దుర్గ, కె లోవ కుమారి, గంగ భవాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల వినూత్న నిరసన

విశాలాంధ్ర - పి గన్నవరం : మండలంలోని లంకల గన్నవరం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు ఆధ్వర్యంలో భోగిమంటల్లో వైకాపా ప్రభుత్వ జీవో కాపీలను దహనం చేసి వినూత్న నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు పాల్గొని మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక జీవోలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాద నాగమణి, లంకల గన్నవరం ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, టిడిపి నాయకులు సంసాని పెద్దిరాజు, శేరు శ్రీను, లంకె చిరంజీవి, వేమన రామకృష్ణ, కొపనాతి సీతారామస్వామి, పిల్లి శివయ్య, పెదపూడి దుర్గారావు శృంగవరపు శ్రీను వేమన గంగాధర్, తవిటికి బుజ్జి, బొండాడ శ్రీను, నరేష్, పిల్లి శివ పోతురాజు బొమ్మిడి లక్ష్మణ్ లంకె సుబ్బారాయుడు జనసేన పార్టీ మండల కార్యదర్శి బందారు శ్రీను, స్థానిక తెలుగు యువత, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలన సాగనంపాలి

విశాలాంధ్ర - కాకినాడ : జగన్ అరాచక పాలనను సాగ నంపి ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని డాక్టర్ చప్పిడి, నులుకుర్తి పిలుపునిచ్చారు కాకినాడ రూరల్ నియోజకవర్గం చీడిగ గ్రామంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా జగన్ అరాచక పాలనకు సంబంధించి చీకటి జీవోలు 85% అమలు కాని హామీలు స్త్రీలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలు, ప్రతులను భోగిమంటల్లో వేసి సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు ఇవ్వటం జరిగింది. డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ 85% హామీలు జగన్ ప్రభుత్వం అమలు చేయలేదని ఒక్క ఇసుకలోనే 40 వేల కోట్లు దోచేశారని తెలియజేశారు. నులుకుర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ప్రతిపక్షాల గొంతు నొక్కే పనిలో ఉన్నారని వీళ్ళు చేసే అరాచకాలకు త్వరలో బుద్ధి చెప్పాలని కోరారు. మాజీ సర్పంచ్ పితాని అప్పన్న, కరప మండల అధ్యక్షులు దేవు వెంకన్న, ఉమామహేశ్వరి, కోన వెంకటలక్ష్మి, యశ్వంత్ జనసేన యువకులు పాల్గొని జయప్రదం చేశారు.

మన సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

విశాలాంధ్ర - ఆలమూరు : తెలుగు సంస్కృతికి మకర సంక్రాంతి ప్రతీక అని ప్రభుత్వ విప్,కొత్తపేట శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకర జ్యోతి వేడుకల్లో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలు, వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. 30 సంవత్సరాలుగా ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతి వేడుక జరపడం, ఆ సందర్భంగా ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

జనసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామ జనసేన పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పిఠాపురం నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమక్షంలో భోగి పండుగ సందర్భంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఉదయ్ శ్రీనివాస్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగను ఆనందకరంగా జరుపుకోవాలని, భవిష్యత్లో పేదల జీవితాల్లో మరింత వెలుగులు నింపాలన్నారు.